# ఎన్‌కౌంటర్లు
# ప్రజల నిస్సహాయత, న్యాయవ్యవస్థ అనాసక్తి

కె. బాలగోపాల్ *

'ఎన్‌కౌంటర్' హత్యల సంఖ్య ఏటేటా పెరుగుతున్నది. వాటిని ఆపగల మోతాదులో ప్రజల నిరసన లేదు. ఉద్యమాలకు కూడా అంత బలం లేదు. న్యాయవ్యవస్థ గట్టిగా పూనుకుంటే కొంతయినా ప్రభుత్వాన్ని అదుపు చేయగలిగేదేమోకానీ అంతటి సంకల్పం సుప్రీంకోర్టు నుండి జాతీయ మానవహక్కుల కమిషన్‌దాకా ఎవరిలోనూ కనిపించడం లేదు.

ఎన్‌కౌంటర్ల గురించి ఎప్పుడు మాట్లాడినా, మాట్లాడిన విషయాలే మళ్లీ మళ్లీ మాట్లాడినట్టు వుంటుంది. కొంచెమయినా పరిస్థితి మెరుగయితే ఇట్లా అనిపించకపోయేదేమో కానీ మాట్లాడిన కొద్దీ ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు.



1998 సంవత్సరం ఇప్పటిదాకా రికార్డు స్థాయి ఎన్‌కౌంటర్ హత్యలను చూసింది. 1999 ఎన్నికల సంవత్సరం కావడం వల్ల 1998తో పోల్చినప్పుడు సంఖ్య కొంచెం తగ్గినా, గతంతో పోల్చుకుంటే ఈ సంవత్సరంలో జరిగిన ఎన్‌కౌంటర్లు కూడా తక్కువేమీ కావు.

అకస్మాత్తుగా, కాకతాళీయంగా జరిగే 'ఎన్‌కౌంటర్'లకు ఎన్నికలతో ఏం సంబంధం, వరదలతో ఏం సంబంధం అని

* మానవహక్కుల కార్యకర్త, హైదరాబాద్‌లో న్యాయవాది

అడిగేంతటి అమాయకులీ రాష్ట్రంలో బహుశా ఎవరూ లేరు. నిఘంటువును బట్టి అర్థం చేసుకున్నట్లయితే 'ఎన్‌కౌంటర్' జరగడం, జరగక పోవడం అనేవి ఒకరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేని విషయాలు. ఎన్నికలొచ్చాయనో ఎండ లెక్కువగా ఉన్నాయనో లారీ ప్రమాదాలు ఎవరూ ఆపలేరు కదా. ఎన్‌కౌంటర్‌లు కూడా అంతే అయి వుండాలిగానీ అవి నిజానికి ప్రభుత్వ విధానం ప్రకారం జరిగే హత్యలు కాబట్టి ప్రభుత్వం వాటిని నిలిపివేయగలదు, పెంచదలచుకున్నప్పుడు అకస్మాత్తుగా పెంచగలదు.

మొన్నటి ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత ఎన్‌కౌంటర్లు అకస్మాత్తుగా తగ్గిపోయి ఎన్నికలు దగ్గరికొచ్చేసరికి పూర్తిగా ఆగిపోయిన సంగతి అందరూ గమనించే వుంటారు.

గతానికీ ఈ మధ్యకాలానికీ సంఖ్యలో పెరుగుదలేకాక మరొక తేడా కూడా వుంది. సాయుధ దళాలు, లేదా సాయుధులయిన ఎం.ఎల్ పార్టీల ముఖ్యులు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం ఈ మధ్య కాలంలో ఎక్కువయింది. ఒక నక్సలైట్ దళం ఫలాన చోట ఉందని పోలీసులకు తెలిసి కూడా ఆ దిక్కు పోకుండా వున్న ఉదంతాలు గతంలో అనేకం వుండేవి. ఇప్పుడటువంటివి లేవని అనలేముగానీ, పోలీసు బలగాలు నక్సలైట్ దళాలను వెతికి వేటాడి చంపడం బాగా పెరిగింది. దానికి తగిన పారితోషికం కూడా వారికి లభిస్తున్నది. దళాల దగ్గర తరచుగా డబ్బులు దొరుకుతాయి. వాటిలో పెద్ద భాగం జేబులో వేసుకొని మిగిలినది మాత్రమే ఎఫ్ఐఆర్‌లోకి ఎక్కించడం పోలీసులకు కొంతకాలంగా అలవాటయింది. అందుకోసమే జరిగాయని కచ్చితంగా చెప్పగల ఎన్‌కౌంటర్‌లు కొన్ని వున్నాయి.

అయితే ఇప్పుడు ఆ శ్రమ కూడా లేకుండా, జిల్లా పోలీస్ అధికారులు హతుల దగ్గర దొరికిన డబ్బు అక్కడికక్కడే హంతకులకు పంచి ఇవ్వడం మొదలయింది. నెత్తురోడుతున్న మృతదేహాల పక్కనే ఈ డబ్బు పంపకాలు చేసుకోవడం తలచుకుంటేనే ఎబ్బెట్టుగా అనిపిస్తుందిగానీ పంచేవాళ్లూ పుచ్చుకునేవాళ్లూ అట్లా అనుకోవడం లేదు. నక్సలైట్ పార్టీలు- చిన్నవీ పెద్దవీ కూడా- డబ్బు వసూలు పెద్ద మొత్తంలో చేపడుతున్నాయి కాబట్టి దళాలను చంపితే ఎంతో కొంత పెద్ద మొత్తమే దొరుకుతోంది. దళాలను వేటాడి చంపడానికి పోలీసులకిది ఒక ముఖ్య ప్రోత్సాహం.

దీని అర్థం పోలీసులు దళాలతో ముఖాముఖి తలపడుతున్నారని కాదు. వెంబడించి వెతికి సమాచారం రాబట్టి ఏ యింట్లోనో వాళ్లు తలదాచుకున్నప్పుడు బయటికొచ్చే అవకాశం లేకుండా ట్రాప్ చేసి ఏకపక్షంగా హతమారుస్తున్నారు. నక్సలైట్ దళాల దగ్గర బలమైన ఆయుధాలు పెద్దగా లేని ఉత్తరాంధ్ర జిల్లాలలో మాత్రమే పోలీసులు కొంత సాహసం ప్రదర్శిస్తున్నట్లు అనిపిస్తుంది.

ప్రమోషన్లు మరొక బహుమానం. ఎన్‌కౌంటర్‌లు చేసే పోలీసులకు మామూలు కంటే వేగంగా ప్రమోషన్లు ఇచ్చే ప్రోత్సాహకాన్ని చంద్రబాబు పగ్గాలు చేపట్టిన తరువాత ప్రవేశపెట్టారు. ఇది చాలా హానికరమైన పోటీకి దారితీస్తున్నది. వెనుకబడి పోయిన పోలీస్ సిబ్బంది గబగబా రెండు 'ఎన్‌కౌంటర్'లు చేసేసి తమతోటి వారిని అందుకున్న ఘటనలు లేకపోలేదు.

'ఎన్‌కౌంటర్ల' సంఖ్య పెరగడానికి, సాయుధ దళాలతో సహితం తలపడడానికి పోలీసులు గతంలో కంటే ఎక్కువ సంసిద్ధత చూపించడానికి వేరే ఒక కారణం కూడా వుందేమో. ఇది నక్సలైట్ల స్వయంకృతాల ఫలితం. నక్సలైట్ ఉద్యమానికి మొత్తంగా పోలీసులు శత్రువులని భావించగల పరిస్థితి ఈ రోజు వుంది. అందువల్ల కూడా నక్సలైట్ల వేటలో గతంలో కంటే ఎక్కువ ఉత్సాహంతో సగటు పోలీసులు పాల్గొంటూ వుండవచ్చు. నక్సలైట్ల దాడులలోనూ మందుపాతర ఘటనలలోనూ

ఎక్కువగా చనిపోతున్నది కింది స్థాయి పోలీసు సిబ్బందే. దీని వల్ల వారిలో భయం పెరిగే అవకాశం ఎంత వుందో, నక్సలైట్లను ఎదుర్కోవాలన్న పట్టుదల పెరిగే అవకాశం కూడా అంత వుంది.

అయితే దళాలతో పోలీసులు ఏదో ఒక మేరకు తలపడే ఘటనల సంఖ్య కొంచెం పెరిగినప్పటికీ, ఈనాటికీ సగటు ఎన్‌కౌంటర్ ఘటన, పక్కమీది నుండి లేపి తీసుకుపోయి చంపిన ఘటనే. అర్థరాత్రి దాటిన తరువాత నిద్రలేపి తీసుకుపోయి తెల్లవారేలోపల పక్కవూరి శివారులో కాల్చి చంపడమే సగటున ఎన్‌కౌంటరంటే. ఈ హత్యకు గురయ్యేది (ఎప్పుడో తప్ప) సాయుధ దళ సభ్యులు కాదు. ఎక్కువ భాగం మిలిటెంట్లు, సానుభూతిపరులు, ఇంకా సంబంధాలు కొనసాగిస్తున్నారని అనుమానించబడే 'మాజీలు'. ఈ రకమైన హత్యలను కూడా ప్రభుత్వమిచ్చే ప్రమోషన్లు, పారితోషికాలూ ప్రోత్సహిస్తున్నాయి.. సమర్థుడయిన పాలకుడిగా దేశంలోనే కాదు, బయటకూడా గుర్తింపు పొందుతున్న చంద్రబాబు పోలీసు హత్యకాండను కూడా చాలా 'సమర్థంగా' పెంచుతున్నాడని ప్రపంచమింకా గుర్తించినట్టు లేదు. ఆయనగారు నమ్మే రాజకీయార్థిక సిద్ధాంతాలలో ప్రోత్సాహకాలకు కేంద్ర స్థానం వుంది. ప్రతిఫలం చూపించి సామర్థ్యం పెంచాలని ఈ సిద్ధాంతాలు చెప్తాయి. దానినే వారు ఎన్‌కౌంటర్‌లకు కూడా వర్తింపచేసి చాలా సమర్థంగా హత్యలు చేయిస్తున్నారు.

మరి ఈ రకమైన హత్యాకాండను అదుపు చేసే బాధ్యత గల సంస్థలు ఏం చేస్తున్నాయి? పోలీసులు మనుషులను పట్టుకుపోయి కాల్చి చంపడాన్ని భారత రాజ్యాంగం ఆమోదించదు. ఇంట్లో 'ట్రాప్' చేసి కిటికీలలో నుండి, పైకప్పు పెంకులు తొలగించి ఆ పొక్కలలో నుండి కాల్చి చంపడాన్ని కూడా ఆమోదించదు. హతులు సాయుధులు కావచ్చు, 'తీవ్రవాదం' అని పిలవబడే రాజకీయ పోకడలు గలవారు కావచ్చు, ఇంకెవరయినా కావచ్చు. ఆమోదించకపోవడమే కాదు, అటువంటి హత్యలను చట్టం సాధారణ పౌరులు చేసే నేరాలతో సమానంగా చూడాలంటుంది.

మన రాజ్యాంగం, చట్టాలేకాక భారత ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ ఒడంబడికలు కూడా ఉన్నాయి. సార్వభౌమ అధికారం ఉన్న ఒక ప్రభుత్వం అటువంటి ఒడంబడిక పైన సంతకం చేసిందంటే దానిని పాటించే నైతిక బాధ్యత, రాజకీయ బాధ్యత ఆ ప్రభుత్వం పైన ఉన్నాయని అర్థం. అంతర్జాతీయ ఒడంబడికలు అమలు చేసే యంత్రాంగమేదీ లేదు కాబట్టి సంతకం చేయడంతో తన పని అయిపోయిందని ఏ ప్రభుత్వమయినా దబాయిస్తే అది సార్వభౌమత్వం అనే భావననే కించపరచడం తప్ప వేరే ఏమీ కాదు. సార్వభౌమత్వం ప్రజలది. ప్రభుత్వం ప్రజా ప్రతినిధిగా దానిని చలాయిస్తుంది. రాజ్యాంగం ప్రజల ఆకాంక్షల మేరకు ఆ సార్వభౌమత్వాన్ని నిర్వచిస్తుంది. 'ప్రజల' ఆకాంక్షలు అనేవి ఒకటి కాదు కాబట్టి, భిన్న ఆకాంక్షలకు భిన్న స్థితిగతులు, అవసరాల ప్రాతిపదిక వుంది కాబట్టి, అన్ని అవసరాల బలం ఒకటి కాదు కాబట్టి ఈ సార్వభౌమత్వం ఆచరణలో కొందరి ప్రయోజనాలకే పెద్ద పీట వేసినప్పటికీ, సూత్రప్రాయంగా సార్వభౌమత్వం ప్రజలది, రాజ్యాంగమైనా ప్రభుత్వమైనా దానికి ప్రతినిధులు మాత్రమేనని గుర్తించడం అవసరం. అటువంటి రాజ్యాంగం ప్రకటించుకున్న విలువలను, ప్రభుత్వం సంతకం చేసిన ఒడంబడికలను తేలికగా తీసిపారేయడం ప్రజలను అవమాన పరచడమే.

## అంతర్జాతీయ ఒడంబడికలు

భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన కొద్దికాలానికే ఐక్యరాజ్యసమితి రూపొందించిన అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన పైన సంతకం చేసింది. అందులో:

ఆర్టికల్ 3: జీవితం, స్వేచ్ఛ, భద్రత ప్రతి ఒక్కరి హక్కు

ఆర్టికల్ 5: ఎవ్వరినీ చిత్రహింసలకు గురిచేయ కూడదు. క్రూరమైన, అమానవీయమైన, అవమానకరమైన పద్ధతిలో ఎవరితోనూ వ్యవహరించకూడదు, అటువంటి శిక్షలు ఎవరికీ వేయకూడదు.

ఆర్టికల్ 6: ప్రతి ఒక్కరికీ చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు వుండాలి.

ఆర్టికల్ 7: చట్టం ముందు అందరూ సమానమే. ఎటువంటి విచక్షణ లేకుండా చట్టం అందరినీ సమానంగా రక్షించాలి.

ఆర్టికల్ 10: నేరారోపణ విషయంలోగానీ ఇతర హక్కుల, బాధ్యతల విషయంలోగానీ ఒక స్వతంత్రమైన, నిష్పాక్షికమైన న్యాయస్థానంలో బహిరంగ విచారణ పొందే హక్కు అందరికీ సమానంగా వుండాలి.

ఆర్టికల్ 11(1): నేరారోపణ చేయబడ్డ వ్యక్తిని నేరం రుజువయ్యేదాకా నిర్దోషిగానే భావించాలి. నేరం రుజువు చేసే విచారణ బహిరంగ విచారణ అయి వుండాలి, ముద్దాయికి తనపైన ఆరోపణను తిప్పికొట్టడానికి అన్ని అవకాశాలూ వుండాలి.

ఈ హక్కులన్నీ అందరికీ వర్తించాలి. కొందరికి మాత్రమే కాదు. ముఖ్యంగా (ప్రస్తుత సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని) రాజకీయ అభిప్రాయాలననుసరించి కొందరికి నిరాకరించడానికి వీలు లేదు.

ఆర్టికల్ 2: ఈ ప్రకటనలోని హక్కులు, స్వేచ్ఛలు పొందే హక్కు అందరికీ ఉంటుంది. ఏ రకమైన వివక్షా ఈ విషయంలో పాటించడానికి వీలు లేదు. జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేక ఇతర అభిప్రాయాలు, పుట్టుక, స్థితిగతులు, ఆస్తి, సామాజిక స్థితి, జాతీయత మొదలయిన ఏ వివక్షా ఈ హక్కులను అనుభవించే విషయంలో పాటించకూడదు.

ఈ ఒడంబడికను ఐక్య రాజ్యసమితి ఆమోదించింది 1948 డిసెంబర్ 10న. ఆ తరువాత 1966లో రూపొందించి 1976 మార్చి 23న అమలులోకి తీసుకొచ్చిన అంతర్జాతీయ పౌరరాజకీయ హక్కుల ఒడంబడిక ఉంది. అందులో కూడా పైన పేర్కొన్న హక్కుల వంటివే వున్నాయి.

ఆర్టికల్ 6(1): ప్రతీ మనిషికీ జీవించే హక్కు వుంది. దానిని చట్టం కాపాడాలి. చట్ట బాహ్యమైన పద్ధతులలో ఎవ్వరి ప్రాణమూ తీసివేయడానికి వీలు లేదు.

ఆర్టికల్ 7 (1): ఎవ్వరినీ చిత్రహింసలకు గురి చేయడానికి వీలు లేదు. క్రూరమైన, అమానవీయమైన, అవమానకరమైన పద్ధతులలో ఎవరితోనూ ప్రవర్తించకూడదు. అటువంటి శిక్షలు ఎవరికీ వేయకూడదు.

ఆర్టికల్ 16: ప్రతిఒక్కరికీ చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు వుండాలి.

ఆర్టికల్ 26: చట్టం ముందు అందరూ సమానమే. ఎటువంటి వివక్షా లేకుండా చట్టం అందరికీ రక్షణ కల్పించాలి. ఇటువంటి వివక్షను చట్టం నిషేధించాలి. జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేక ఇతర అభిప్రాయాలు, ఆస్తి, పుట్టుక మొదలయిన కారణాలుగా ఎవరూ వివక్ష అనుభవించకుండా వుండేటట్టు అందరికీ సమానంగా సమర్థంగా చట్టం రక్షణ కల్పించాలి.

ఎవ్వరినీ చిత్రహింసలకుగానీ, క్రూరమైన, అమానుషమైన, అవమానకరమైన శిక్షలకుగానీ గురి చేయకూడదన్న నియమం ఈ రెండు ప్రకటనలలోనూ ఉన్నాయి. 1984లో ఐక్యరాజ్య సమితి ఈ

విషయం మీదనే ఒక ప్రత్యేకమైన ఒడంబడికను రూపొందించింది. అది 26 జూన్ 1987న అమలులోకి వచ్చింది.

ఇవన్నీ ఏకరవు పెట్టి ఏం ప్రయోజనమని చాలామంది అనుకోవచ్చు. అమలు చేసే యంత్రాంగమేదీలేని నియమాలను పాటించకపోతే అడగడానికి హక్కెవరికీ లేదని ప్రభుత్వాలు దబాయించినట్టే, అడిగి ప్రయోజనమేమీ లేదని మనం కూడా అనుకుంటున్నాం. అది ఎందుకు తప్పో పైన చెప్పాను. అసలు ప్రపంచ దేశాల ప్రభుత్వాల ఉమ్మడి వేదిక అయిన ఐక్యరాజ్య సమితి ఇటువంటి ఒడంబడికలూ ప్రకటనలూ రూపొందించిందంటేనే అంతటి ఆమోదం వాటికి మానవ సమాజంలో వుందని, అంతటి ఆకాంక్ష ప్రజలలో ఉందని అర్థం. అమలు చేసే యంత్రాంగం లేదు కాబట్టి వీటి గురించి మాట్లాడడం వృథా అనుకోవడం ఆ ఆకాంక్షను అవమానపరచడమే.

అయినా ఈ అంతర్జాతీయ ఒడంబడికలనూ ప్రకటనలనూ కొన్ని సందర్భాలలో మన దేశంలోని కోర్టులు అమలు చేయించవచ్చునని భారత సుప్రీంకోర్టు అనింది. మన రాజ్యాంగం ప్రాథమిక హక్కులు కల్పించిన విషయాలపైన అంతర్జాతీయ ఒడంబడికలలో నియమాలేమైనా వుంటే, వాటిని మన రాజ్యాంగ హక్కులను విశదీకరించే విషయాలుగా భావించి, వాటిని కూడా రాజ్యాంగ హక్కులలాగా అమలు చేయించే అధికారం మన కోర్టులకుందని సుప్రీంకోర్టు 1997లో పియుసిఎల్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో అనింది. (ఇదికూడా ఎన్‌కౌంటర్‌లకు సంబంధించిన కేసే కావడం గమనార్హం. ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినవారి కుటుంబాలకు ఒక లక్ష రూపాయల నష్టపరిహారం ఇమ్మని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ జస్టిస్ జీవన్ రెడ్డి ఈ తీర్పు యిచ్చారు).

అంతకంటే ముందే (1996లో), ఒక పర్యావరణ సంబంధమైన కేసులో (వేలూర్ సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా) జస్టిస్ కుల్దీప్ సింగ్ అంతకంటే లోతయిన సూత్రీకరణ చేశారు. ఒక అంతర్జాతీయ ఒడంబడికలోని అంశాలు మన దేశ చట్టానికి వ్యతిరేకం కాకపోతే, వాటిని మన దేశ న్యాయస్థానాలు అమలు చేయించవచ్చునన్నారు.

కాబట్టి అంతర్జాతీయ ఒడంబడికలూ ప్రకటనలూ ఇప్పుడింక అమలు చేసే యంత్రాంగం లేని కాగితపు పులులు కావు. మన దేశ చట్టాలు ఏ మేరకు అమలు చేయించుకోగలమో ఆ మేరకు వాటిని కూడా న్యాయస్థానాల ద్వారా అమలు చేయించుకోవచ్చు.

అది ఏ మేరకు అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు మాత్రం, అన్ని విషయాలలో కాకున్నా వ్యవస్థిత పెత్తనాన్నీ అధికారాన్నీ (అది రాజకీయం కావచ్చు, సాంఘికం కావచ్చు, ఆర్థికం కావచ్చు) కదిలించే హక్కుల విషయంలో మాత్రం జవాబు నిరాశాజనకంగానే వుందని చెప్పక తప్పదు.

## కలకత్తా హత్యలపై కోర్టుల మౌనం

కలకత్తా నగరంలో నక్సల్బరీ రాజకీయాల తొలిదశలో జరిగిన భీకరమైన హత్యాకాండపైన ఇప్పటికైనా ఒక విచారణ జరిపించాలని కేసు వేసిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎపిడిఆర్ అనే హక్కుల సంఘానికి కలకత్తా హైకోర్టులోనూ సుప్రీంకోర్టులోనూ ఎదురయిన చేదు అనుభవాన్నే ఉదాహరణగా తీసుకోవచ్చు. 1968-72ల మధ్య కాలంలో కలకత్తా నగరంలో నక్సలైట్లుగా భావించబడే వ్యక్తులు పెద్ద సంఖ్యలో చంపబడ్డారు. అవన్నీ ఇప్పటి ఎన్‌కౌంటర్ల వంటివి కావు. పోలీసులూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలూ నక్సలైట్ల చేత చంపబడ్డవారి అనుచర గణమూ కలిసి లెక్కపక్కా లేకుండా జరిపిన మారణకాండ అది. అప్పట్లో హక్కుల సంఘాలు లేకపోవడం వల్ల

(ప్రస్తుతం దేశంలో పని చేస్తున్న హక్కుల సంఘాలలో మొదటిదయిన ఎపిడిఆర్ ఈ మారణకాండ ఫలితంగానే ఆ దశ చివరిభాగంలో - అంటే 1972లో- ఏర్పడింది) ఈ హత్యల వివరాలు పూర్తిగా బయటికి తెచ్చేవారెవరూ లేకపోయారు. సిపిఐ (ఎం.ఎల్)కు అంతటి నిర్మాణం లేదు.

1972 తరువాత ఎపిడిఆర్ సేకరించిన వివరాలను బట్టి చూస్తే ఆ నాలుగు సంవత్సరాలలో కొన్ని వందల ప్రాణాలు పోయాయని తెలిసింది. ఈ రోజు మన రాష్ట్రంలో జరుగుతున్న హత్యాకాండతో పోలిస్తే అది కొంచెం తక్కువ పరిమాణంలోని హత్యాకాండేగానీ విచ్చలవిడితనంలో అది దీని తలదన్నిన కాలం. కొన్ని ఉదాహరణలు చెప్పుకుంటే ఆనాటి వాతావరణం అర్థం కావచ్చు.

1970 సెప్టెంబర్ 25న కలకత్తా మెడికల్ కాలేజి హాస్పిటల్ నుండి ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారు. కాలేజ్ స్ట్రీట్ పక్కనున్న భవానీదత్త వీధిలోకి వ్యాన్‌లో తీసుకుపోయి అక్కడ దించి వెళ్లిపొమ్మన్నారు. వాళ్లు వెళ్లిపోతుండగా వెనుక నుండి కాల్చి చంపారు. పోస్టర్లు అంటిస్తున్న నక్సలైట్లను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా వారు పోలీసుల పైన తిరగబడ్డారనీ, పోలీసులు ఎదురు కాల్పులు జరుపగా వారు చనిపోయారనీ అన్నారు.

1970 నవంబర్ 28న కలకత్తా మైదాన్‌లోని షహీద్ మినార్ దగ్గర 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రెండు కార్లలో ఎక్కించి లాల్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టారు. తరువాత వారి శవాలు నగరం బయట జాతీయ రహదారి పైన ఇక్కడొకటి అక్కడొకటి కొన్ని మైళ్ల పర్యంతం పడి వున్నాయి. ఈ హత్యాకాండపైన అప్పట్లో జస్టిస్ తారాపద ముఖర్జీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన విచారణ మొదలు పెట్టిన కొద్ది రోజులకు ఆయనను ఎవరో కత్తితో పొడిచారు. ఆయన కోలుకున్నాడుగానీ విచారణ ఇంక కొనసాగించలేదు.

1971 జనవరి 24న దక్షిణ 24 పరగణాల జిల్లాలోని డైమండ్ హార్బర్ వద్ద ఆరు శవాలు దొరికాయి. వాళ్లు బందిపోట్లని పోలీసులన్నారు. కానీ వాళ్లు నక్సలైట్లయి వుంటారని స్థానికుల అభిప్రాయం. వారిని ఎవరు చంపారో ఏం జరిగిందో ఎవరికీ తెలియదు.

1971 జూన్ 1వ తేదీన కోన్‌నగర్‌లో పోలీసులు తొమ్మిది శవాలను తవ్వి వెలికి తీశారు. పోలీసు రికార్డుల ప్రకారం వారు నక్సలైట్లని తేలింది. కాంగ్రెస్ పార్టీకి చెందినవాళ్లు వారిని హతమార్చి పూడ్చి పెట్టారు. శవాల తల, చేతులు తెగనరకబడి వున్నాయి.

కాశీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక గుండా నాయకుడయిన కాంగ్రెస్ నేతను నక్సలైట్లు చంపినందుకు ప్రతీకారంగా, పోలీసుల గ్రీన్‌సిగ్నల్‌తో కాంగ్రెస్‌వాళ్లు 1971 ఆగస్టు 12-13 తేదీలలో పెద్దఎత్తున ప్రతీకార హత్యాకాండకు పాల్పడ్డారు. 150 మందిని చంపారన్న ఉద్యమకారుల అంచనా అతిశయోక్తి అనిపిస్తుందిగానీ పెద్దఎత్తున చంపారనేది సత్యం. తుపాకులు ధరించిన ఇద్దరు కిరాయి హంతకులు లిస్టు ప్రకారం ఈ మారణకాండకు పాల్పడుతుండగా పోలీసులు వారి పని ఎక్కడిదాకా వచ్చిందని లెక్కలు పెట్టుకున్నారని ఆరోపణ.

ఆనాటి పశ్చిమ బెంగాల్ వాతావరణం కొంత అర్థమయి వుంటుంది. ఈ హత్యాకాండపైన ఆందోళన జరగగా జరగగా పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం 1984లో జస్టిస్ చక్రవర్తి కమిషన్‌ను న్యాయవిచారణ నిమిత్తం నియమించింది. అయితే న్యాయవిచారణ కమిషన్‌ను నియమించాలన్న నిర్ణయం ఏ ఆధారం మీద రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందో చెప్పలేకపోయిందంటూ కలకత్తా హైకోర్టు ఆ కమిషన్ నియామకాన్ని కొట్టి వేసింది.

(ప్రజాజీవితానికి ప్రాముఖ్యం గల విషయమని భావించి ప్రభుత్వం న్యాయవిచారణ కమిషన్

నియమిస్తే అది ప్రాముఖ్యం గల విషయమని చెప్పడానికి ప్రభుత్వం ఆధారాలు చూపలేకపోయిందని చెప్పి కమిషన్ నియామకాన్ని కొట్టి వేయడం ఈ నాటికీ కొనసాగుతున్నది. మన రాష్ట్ర హైకోర్టు ఈ మధ్యనే ఏలేరు స్కాం మీద రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ కమిషన్‌ను కొట్టి వేసింది. వేరే విషయంలో ప్రభుత్వం చేసే పనులలో ప్రజా ప్రయోజనం ఎంత వుందో చూడడానికి సులభంగా సిద్ధపడని కోర్టులు, ప్రజా ప్రయోజనం ఒకవేళ లేకున్నా ఎవరికీ ఏ నష్టమూ చేయని న్యాయవిచారణ కమిషన్ల నియామకాలను కొట్టివేయడానికి సులభంగా సిద్ధపడటం కొంచెం ఆశ్చర్యం కలిగించే విషయమే).

ఆ ఉదంతం అక్కడితో ముగిసింది. కానీ 1998లో ఎపిడిఆర్ చొరవ తీసుకొని మళ్లీ కలకత్తా హైకోర్టులో రిట్ పిటీషన్ వేసింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ కమిషన్ ఎందుకు వేయవలసి వచ్చిందన్న ఆధారాలు చూపించలేకపోయిందని చెప్పి కమిషన్ నియామకాన్ని కొట్టేసిన హైకోర్టుకు ఎపిడిఆర్ ఇప్పుడు హత్యల జాబితా ఇచ్చి న్యాయవిచారణ కమిషన్ నియమించడానికి ఈ మాత్రం ఆధారం చాలును కాబట్టి ప్రభుత్వానికి ఆదేశం ఇమ్మని చెప్పి రిట్ కోరింది. ఈసారి కలకత్తా హైకోర్టు 'లేటయిపోయింది' అనింది. సంఘటనలు జరిగి దాదాపు 27 ఏళ్లు గడిచిన తరువాత న్యాయవిచారణ జరిపి ఏం ప్రయోజనం ఉంటుంది? అని అడిగింది. 1984లో న్యాయవిచారణ కమిషన్ నియామకాన్ని హైకోర్టు కొట్టేసినప్పుడు సుప్రీం కోర్టుకెందుకు పోలేదు? అనింది. (అప్పుడు పోనిదెవరు? ఇప్పుడు కేసు వేసిందెవరు? వీరిని ఆ ప్రశ్న వేయడం సబబా? అని హైకోర్టుకు తోచలేదు). 1984 నుండి 1998 దాకా ప్రజాప్రయోజనాల వ్యాజ్యం ఎందుకు వేయలేదు? ఇంత ఆలస్యంగానా కేసు వేసేది? ఇప్పుడు న్యాయవిచారణ జరిపించినా సాక్ష్యాలు ఏం దొరుకుతాయి? అంటూ అనేక సందేహాలు వ్యక్తం చేసి 1999 ఫిబ్రవరి 2న కలకత్తా హైకోర్టు ఈ కేసు కొట్టేసింది.

కలకత్తా హైకోర్టు సందేహాలను వివరంగా విమర్శించవలసిన అవసరం లేదు. తాను చేయవలసిన పని చేయలేక సాకులు వెతుక్కునే ప్రయత్నంగా దానిని గుర్తించడం కష్టం కాదు. అయితే ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు పోతే 'హైకోర్టు సకారణంగానే కొట్టేసింది కదా' అని అత్యున్నత న్యాయస్థానం అయిదు నిమిషాలలో తేల్చి చెప్పేసింది.

సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటీషన్‌లో పైన వివరించిన న్యాయ సిద్ధాంత సూత్రాలను పిటిషనర్లు వివరించకపోలేదు. అంతర్జాతీయ ఒడంబడికల గురించి, వాటి అమలు విషయంలో ఇదే సుప్రీం కోర్టు చేసిన సూత్రీకరణల గురించి చెప్పడం జరిగింది. అయినప్పటికీ సుప్రీంకోర్టు వినదల్చుకోలేదు. ఇది కాకతాళీయం కాదు. ఒకటి రెండు ఎన్‌కౌంటర్ ఘటనలపైన రిట్ పిటిషన్లు వేసినప్పుడు సుప్రీంకోర్టే కాదు, వివిధ హైకోర్టులు సహితం నష్టపరిహారం ఇప్పించిన ఉదంతాలు, రాష్ట్ర సిఐడి చేతగానీ సిబిఐ చేతగానీ నేర పరిశోధన జరిపించమని ఆదేశించిన ఉదంతాలూ ఉన్నాయిగానీ 'ఎన్‌కౌంటర్ల పాలసీ' గురించి వేసిన ఒక్క కేసూ ఇప్పటిదాకా ఆదరణ పొందలేదు.

## హక్కుల కమిషన్ చెప్పినా వినలేదు

న్యాయస్థానాల వైఖరి ఈ రకంగా వుంటే జాతీయ మానవహక్కుల కమిషన్ వైఖరి అంతకంటె పెద్ద భిన్నంగా లేదు. మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఎన్‌కౌంటర్ల పాలసీ గురించి ఎపిసిఎల్‌సి పంపించిన ఫిర్యాదు పైన జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్రానికొచ్చి విచారణ జరిపిన సంగతి తెలిసిందే. అయిదు ఘటనలపైన విచారణ జరిపి అయిదింటిలోనూ ఫిర్యాది ఆరోపణ నమ్మడానికే

ఆధారాలున్నాయని నిర్ణయించింది. ఎన్‌కౌంటర్ చేసిన పోలీసుల పైన ఎటువంటి నేర విచారణ జరపకుండా, చనిపోయిన నక్సలైట్ల పైన హత్యా ప్రయత్నం కేసుపెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నాన్ని తీవ్రంగా విమర్శించింది. ప్రతీ ఎన్‌కౌంటర్‌పైనా హత్యకేసు నమోదు చేసి ఒక స్వతంత్ర సంస్థ చేత నేర పరిశోధన జరిపించాలన్న సాధారణ సూత్రీకరణ చేస్తూ, తాను విచారించిన అయిదు కేసులనూ పరిశోధన నిమిత్తం రాష్ట్ర సిబిసిఐడికి అప్పగించాలని ఆదేశించింది. ఈ ఆదేశం ఇచ్చింది నవంబర్ 5, 1996న. ఇప్పుడు మూడేళ్లు గడిచాయి. ఇప్పటికీ ఆ అయిదు కేసులను సిబిసిఐడికి అప్పగించలేదు. ఆ తరువాత 'ఎన్‌కౌంటర్' ఘటనలేమయినా తగ్గాయా అంటే తగ్గలేదు. పోనీ జరిగిన ఘటనలపైన హత్యకేసు నమోదు చేసి ఏదైనా స్వతంత్ర పరిశోధన సంస్థకు అప్పగిస్తున్నారా అంటే అదికూడా లేదు. నిజానికి 1996 నవంబర్ 5న జాతీయ మానవహక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశంలో సాధారణ సూత్రీకరణ ఏదీ లేదనీ, ఆ రిపోర్టు కేవలం ఆ అయిదు ఘటనలకు సంబంధించినది మాత్రమేననీ అప్పటినుండి మన రాష్ట్ర ప్రభుత్వం దబాయిస్తూనే వుంది. ఆ అయిదు కేసులలో సహితం నివేదికలోని ఆదేశాలను పాటించనప్పుడు ఈ దబాయింపెందుకో!

1996 నవంబర్ 5న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలోని సూత్రీకరణ కేవలం ఆ అయిదు కేసులకు మాత్రమే సంబంధించినది కాదని స్పష్టంగా సూచిస్తూ, జాతీయ మానవ హక్కుల కమిషన్ 1997 మార్చి 29న దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకూ ఒక సర్క్యులర్ జారీ చేసింది. అందులో:

> *ఆంధ్రప్రదేశ్‌లో, బహుశా దేశమంతటా, జరుగుతున్నదేమిటంటే ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత అందులో పాల్గొన్న పోలీస్ పార్టీ ముఖ్యుడు పోలీస్‌స్టేషన్‌లో ఆ ఎన్‌కౌంటర్ గురించి, అందులో చనిపోయిన వారి గురించి సమాచారం ఇస్తాడు. ఏపిసిఎల్‌సి ఫిర్యాదు చేసిన ఈ అన్ని ఘటనలలోనూ పోలీసుల కథనం ఒక్కటే. చనిపోయిన వ్యక్తులు పోలీసులను చూడగానే వారిని హతమార్చే ఉద్దేశ్యంతో కాల్పులు జరిపారనీ, కాబట్టి వారు ఐపిసి సెక్షన్ 307 ప్రకారం శిక్షార్హులనీ ఫిర్యాదు తెలియచేస్తుంది. తాము వారిపైన కాల్పులు జరిపి చంపడం ఆత్మరక్షణ హక్కులో భాగంగా జరిగిందని పోలీసులు అంటారు. ఈ సమాచారం మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. అందులో పోలీసుల తూటా దెబ్బలకు చనిపోయిన వారిని ముద్దాయిలుగా చూపించడం జరుగుతుంది. ముద్దాయిలు చనిపోయారు కాబట్టి ఇంక ఏ నేర పరిశోధనా లేకుండా కేసులను మూసేస్తున్నారు.*

అని వివరించి,

> *మన చట్టాలలో పోలీసులకు ఒకరి ప్రాణం తీసే హక్కులేదు. ఒక పోలీసు అధికారి తన చర్యద్వారా ఒక ప్రాణం తీస్తే, అది చట్టం కల్పించే ఏదైనా మినహాయింపు కిందకి వస్తే తప్ప హత్యే అవుతుంది. ఆ చర్య ఆత్మరక్షణలో జరిగి వుంటే అది నేరం కాదని చట్టం చెప్తుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 46 కింద కూడా ఆ పోలీస్ అధికారి చర్య సమర్థనీయం కావచ్చు... ఈ రెండు మినహాయింపుల కిందికి రాని పక్షంలో ఆ పోలీసు అధికారి చేసినది హత్యనేది స్పష్టమే. ఎన్‌కౌంటర్ పేరిట జరిగిన ఘటన ఈ రెండు మినహాయింపులలో ఒకదాని కిందికి వస్తుందా రాదా అనేది సరయిన నేర పరిశోధనలో మాత్రమే తేలగలదు*

అని స్పష్టం చేసింది. ఈ వివరణ ఆధారంగా నాలుగు నియమాలను జాతీయ మానవ హక్కుల

కమిషన్ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ జారీ చేసింది.

ఎ) పోలీసులకూ ఇతరులకూ మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన సమాచారం పోలీస్‌స్టేషన్ అధికారి దృష్టికి వచ్చినప్పుడు అతను దానిని జనరల్ డైరీలో నమోదు చేయాలి.

బి) ఆ సమాచారం ఒక కాగ్నిజబుల్ నేరం జరిగిన విషయాన్ని తెలుపుతుందని గుర్తించి వెంటనే దానిని పరిశోధించడానికి ఉపక్రమించాలి. ఏదైనా నేరం జరిగిందా, నేరం ఎవరు చేశారు అనే విషయాలు నిర్ధారించే ప్రయత్నం చేయాలి.

సి) ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నది ఆ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసు సిబ్బందే అయి వుంటారు కాబట్టి ఈ ఘటనపైన జరిగే పరిశోధనకు వేరే ఏదైనా స్వతంత్ర పరిశోధన సంస్థకు - ఉదాహరణకు రాష్ట్ర సిఐడికి- అప్పగించాలి.

డి) ఈ నేరపరిశోధన ఫలితంగా పోలీసుల పైన విచారణ జరిగి వారికి శిక్ష పడినట్టయితే మృతుల కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చే విషయం పరిశీలించవచ్చు.

ఇది జారీ చేసి మూడు నెలలు తక్కువగా రెండేళ్లు కావస్తున్నది. ఈ రెండేళ్ల కాలంలో మన రాష్ట్రంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా 'ఎన్‌కౌంటర్లు' జరుగుతున్నాయి. కాశ్మీర్ లోనయితే చెప్పనవసరమే లేదు. ఇతర రాష్ట్రాలలోనూ (ముఖ్యంగా పంజాబు, ఉత్తరప్రదేశ్, బీహార్, అస్సాం, నాగాలాండ్, మణిపూర్‌లలో) ఎప్పటిలాగే జరుగుతూ వున్నాయి. ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వమూ జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేశాలను అమలు చేసిన దాఖలాలు లేవు.

దీనిని జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను తప్పుపట్టాలని మేము అనడం లేదు. తానిచ్చిన సూచనలను ప్రభుత్వం పాటించకపోతే ఏ రకమైన చర్య తీసుకునే అధికారమూ కమిషన్‌కు మానవహక్కుల పరిరక్షణ చట్టం (1993)లో లేదు. కనీసం ఇతర కోర్టులకుండేట్టు కోర్టు ధిక్కారానికి శిక్షించే అధికారం కూడా లేదు.

అయితే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఎక్కడ తప్పు పడుతున్నామంటే, ఈ దేశంలోని ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వమూ తన ఆదేశాలను ఖాతరు చేయడం లేదని ప్రజలకు చెప్పడానికి జంకుతున్నందుకు. అదేదో తాము సిగ్గుపడవలసిన విషయమైనట్టు మానవహక్కుల కమిషన్ పెద్దలు 'ఏం చెప్పుకుంటాంలే' అని తటపటాయిస్తున్నారు. కానీ ఇందులో వాళ్లు సిగ్గు పడవలసిందేమీ లేదు. సిగ్గంటూ పడితే ప్రభుత్వాలు పడాలి. సిగ్గు లేకపోతే ఆ విషయం బయట పెట్టాలి. మానవహక్కుల కమిషన్ ఛైర్మన్‌గారు ఆంధ్రప్రదేశ్‌తో ఈ ఆదేశం అమలు విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. వారు ఏవో అబద్ధాలు చెప్తున్నారు. అవి అబద్ధాలని ప్రైవేట్‌గా విసుక్కుంటూ, పైకి మాత్రం విభిన్న అధికార సంస్థలు అలవాటుగా పాటించే మర్యాదల్నే మానవహక్కుల సంఘం పెద్దలు పాటిస్తున్నారు. నిజానికి కోర్టులో న్యాయమూర్తులు తమ ఆదేశాలు పాటించని అధికార్లను కోర్టుకు పిలిచి గట్టిగా తిడతారు. వేరే ఏమీజరగకపోయినా ఆ సంతృప్తయినా ఫిర్యాదికి ఉంటుంది. జాతీయ మానవ హక్కుల కమిషన్ చంద్రబాబును ఢిల్లీకి పిలిచి తిట్టనక్కర లేదుగానీ అతగాడి వైఖరిని నిరసిస్తూ బహిరంగ ప్రకటన చేయవచ్చు. అప్పుడు కనీసం కొంచెం భయమైనా వుంటుందేమో. కానీ 'ప్రభుత్వంతో శత్రువైఖరి మాకొద్దు' అని కమిషన్ ఛైర్మన్ అంటారు. మళ్లీ మళ్లీ లేఖలు రాస్తారు.

## ముగింపు దగ్గర్లో లేదు

ఈ సంస్థలేవీ పని చేయకపోయినా ఫరవాలేదు, ప్రజలు పోరాటాలు చేసి ఎన్‌కౌంటర్‌లను

ఆపగలరని ఉపన్యాస ధోరణిలో అనేవారు లేకపోలేదు. ఈ సంస్థలన్నీ ప్రజాతంత్ర రాజకీయ కృషి ఫలితంగా- అంటే ఏదో ఒక రూపంలో జరిగిన ప్రజా ఉద్యమాల ఫలితంగా- ఏర్పడినవే. ప్రజా పోరాటాలు నిజంగా ఇచ్చే ఫలితం ఒక అన్యాయాన్నో మరొక అన్యాయాన్నో ఆపడం కాదు. అది తాత్కాలిక ఫలితం మాత్రమే. నిజమైన ఫలిత మెప్పుడొస్తుందంటే ఆ పోరాటాల ఆకాంక్షలు వ్యవస్థిత రూపం తీసుకున్నప్పుడు, అవి నిత్యం పని చేసినప్పుడు. హక్కుల అమలుకు పోరాటాలు అవసరమైతే చేయవలసిందేగానీ అవి నిత్యం వ్యవస్థితంగా అమలయినప్పుడే నిజంగా హక్కులు వున్నట్టు. హక్కులు అమలు చేయవలసిన సంస్థలను నడిపే వారి వ్యవహార శైలిలో ఆ ఒత్తిడి లేక ఆ చైతన్యం లేక ఆ 'సంస్కారం' భాగమయినప్పుడే అవి నిజంగా దక్కినట్టు. అందుకే భిన్న ప్రజాతంత్ర సంస్థల పనితీరుకు ప్రాముఖ్యం ఇవ్వడం, అవి సరిగ్గా పని చేయకపోవడానికి గల వైయక్తిక, సామాజిక, సాంస్కృతిక కారణాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

అదెట్లాగున్నా, ఇప్పుడు ఎన్‌కౌంటర్ల విషయంలో అంతటి ప్రజాస్పందన కూడా లేదు. హతుని వ్యవహార శైలి వల్ల అతనికి స్థానికంగా ప్రజాభిమానం వున్నప్పుడు, లేదా హతునికి స్థానికంగా విస్తృతమైన సామాజిక సంబంధాలు వున్నప్పుడు (ఉదాహరణకు అతనిది సంఖ్యరీత్యా పెద్దదయిన కులమైనప్పుడు), ఎక్కువ భాగం హతుడు చనిపోయిన ప్రాంతానికి స్థానికుడయినప్పుడు ప్రజలలో స్పందన వస్తున్నదే తప్ప అన్ని సందర్భాలలో రావడం లేదు. ఈ స్పందన దహనకాండకు పెద్ద సంఖ్యలో హాజరుకావడం, శవం దగ్గర పోలీసులను తిట్టిపోసుకోవడం మొదలయిన రూపాలలో వుంటున్నది. నూటికి అయిదు లేక పది కేసులను మించి కనిపించని ఈ స్పందనలో హతుని మీద అభిమానం ఎంత, ఎన్‌కౌంటర్‌ల పట్ల రాజకీయ వ్యతిరేకత ఎంత అంటే మొదటిదే ఎక్కువ అని చెప్పవచ్చు. అయినా, పాకిస్తాన్ నుండి వచ్చి కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్‌లో చనిపోయే అపరిచితుడయిన ముజాహిదీన్‌కు సహితం ఉద్యమకాంక్ష నుండి పుట్టిన అభిమానంతో మన దగ్గరి కంటే చాలా తరచుగా, ఎక్కువగా నిరసన తెలిపే కాశ్మీరీలు సహితం తమ నిరసన ద్వారా ఎన్‌కౌంటర్ హత్యలను తగ్గించలేకపోతున్నప్పుడు మన దగ్గర వ్యక్తమయ్యే ఈ పాటి నిరసన ఆ పని చేయగలుగుతుందని నమ్మడం కష్టం.

ఈ నిరసనను పెంచడం ఎంత ముఖ్యమైన కర్తవ్యమో, రాజ్యహింసను అదుపు చేసే చట్టపరమైన బాధ్యత గల సంస్థలకు బలం చేకూర్చడమూ అంతే ముఖ్యం. అది రోజురోజుకూ మరింత కష్టతరమైన కర్తవ్యంగా కనిపిస్తున్నప్పటికీ దాని మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టడం చాలా అవసరం.

✦